క్లుప్తంగా

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా సహాయ కార్యదర్శిగా శంకరరావు


మాకాల శంకరరావు

తగరపువలస: బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి విశాఖ జిల్లా సహాయ కార్యదర్శిగా చిట్టివలసకు చెందిన మాకాల శంకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం శంకరరావు భీమిలి మండలం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇటీవల నగరంలోని ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సమావేశంలో శంకరరావు నియామకం జరిగింది.

ఏసీపీ శాస్త్రి దృష్టికి సమస్యలు


ఏసీపీ శాస్త్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 ఏసీపీ శెబ్‌నాస్ శాస్త్రిని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్ సీపీ 5వ వార్డు నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దుస్సాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ మేరకు మధురవాడ, 5వ వార్డు పరిధిలో టౌన్ ప్లానింగ్ విభాగం చేపట్టాల్సిన చర్యలు, ఇతర సమస్యలపై ఆయనతో చర్చించారు. ఎస్.రుషికేశ్వరరావు, కల్లేపల్లి శంకరరావు, వెంకటేశ్వరరావు, చిన్నంనాయుడు, రాము, వసంత్ తదితరులు ఉన్నారు.

జగనన్న ఇళ్లకు అర్హులను గుర్తించండి


మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: సొంత స్థలాలు ఉండి జగనన్న ఇళ్లు కావాల్సిన వారిని గుర్తించాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత స్థలాలు ఉన్న వారు జగనన్న కాలనీ ఇళ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆర్.పద్మజ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

రగ్బీ రాష్ట్ర పోటీలకు ఎంపిక


రమ్య

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.రమ్య రగ్బీ క్రీడలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో రమ్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

తాత్కాలికంగా సిటీ బస్సుల రూట్ మార్పు

మధురవాడ: ఏపీఎస్ఆర్‌టీసీ మధురవాడ డిపోకి చెందిన 25వి, 25డి/వి టౌన్ కొత్తరోడ్డు – వాంబేకాలనీ సిటీ బస్సులు నడిచే రూట్‌లలో తాత్కాలికంగా మార్పులు చేస్తున్నట్టు ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ టి.ఉమా మహేశ్వర రెడ్డి చెప్పారు. డిపోకి వెళ్లే రోడ్డులో ఖుషి షాపింగ్ మాల్ వద్ద జీవీఎంసీ కల్వర్టు నిర్మిస్తున్నందున ఈ మార్గంలో బస్సులు నడపడం ఇబ్బంది అవుతుందని చెప్పారు. అందుకే ఈ సర్వీసులు కార్‌షెడ్, వుడా కాలనీ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద గల డబల్ రోడ్డు, వుడా కాలనీ మీదుగా వాంబే కాలనీ వరకు నడుస్తాయని చెప్పారు. ఈ మార్పు తక్షణమే అమల్లోకి వస్తుందని, ప్రయాణికులు అంతా గమనించాలని ఉమా మహేశ్వరరెడ్డి కోరారు.

సీఎం జగన్ పాలనలో అందరికీ లబ్ధి


తాళ్లవలసలో రైతుభరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


తాళ్లవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: గతంలో ఎప్పుడూ లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఊరిలో అర్హత కలిగిన ప్రజలంతా లబ్ధి పొందుతున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం భీమిలి మండలం తాళ్లవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షలతో నిర్మించతలపెట్టిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, రూ.27.79 లక్షలతో చేపట్టనున్న జలజీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్ పరిపాలన చేస్తున్నారన్నారు. పంచాయతీలో 1600 మంది ప్రజలకు రూ.25 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఎన్నికలు సమీపించే సమయంలో టీడీపీ, జనసేన నాయకులు వచ్చి చెప్పే కల్లబొల్లి కబుర్లకు మోసపోవద్దని సూచించారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జన్మభూమి కమిటీల మాదిరిగా అవినీతికి పాల్పడకుండా రాష్ట్ర ప్రజలకు ఇంటి వద్దకే అందుతున్న సంక్షేమ పథకాలు చూసి ప్రతిపక్షాలకు కడుపుమంటగా ఉందన్నారు. ఇప్పటి వరకు పంచాయతీలో ఒక్కొక్కరికి రూ.15 లక్షల విలువైన ఇంటి స్థలాలను 270 మందికి ఇచ్చామన్నారు. మరో 90 మందికి ఇవ్వనున్నామన్నారు. డ్రైనేజీ, శ్మశానవాటిక, కల్యాణమండపం సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు.

టీడీపీ మూడేళ్లు రేషన్ ఇవ్వలేదు..

గతంలో టీడీపీ ప్రభుత్వం వివక్షతో తన కుటుంబానికి మూడేళ్లు రేషన్ బియ్యం ఇవ్వకుండా ఆడుకుందని 3వ వార్డు సభ్యుడు ఎరుసు గోవింద్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చిన తర్వాత వివక్షకు తావు లేకుండా గడప ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా 6వ తరగతి విద్యార్థి చరణ్ ప్రభుత్వ పథకాలను గుక్క తిప్పుకోకుండా చెప్పడంతో ఎమ్మెల్యేతో సహా అందరూ అభినందించారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ బోని జగ్గమ్మ, సన్నిబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ, చిల్ల హరి, అక్కరమాని అప్పలనాయుడు, దంతులూరి వేణురాజు, గాడు వెంకట నారాయణ, సమ్మిడి శ్రీనివాసరావు, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, మేరుగు ఎల్లాజీ, వీఆర్వో పి.వెంకట అప్పారావు, కార్యదర్శులు ప్రసాద్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ క్రీడాకారులకు అభినందనలు


క్రీడా పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో రమణ

పద్మనాభం: ఆరిలోవ సమీప తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పద్మనాభం భవిత కేంద్రం విద్యార్థులు ఎనిమిది మందిని మండల విద్యాశాఖ అధికారి పి.రమణ బుధవారం అభినందించారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. బాలుర విభాగంలో రన్నింగ్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న తాడి లక్ష్మి, ద్వితీయ స్థానంలో నిలిచిన జి.మహేష్, త్రో బాల్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎం.దిలీప్, బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన కె.మౌనిక, షార్టుపుట్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.కె.రెహమెన్, స్లో వాక్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన బాయి మోహన్ సతీష్, ద్వితీయ స్థానాన్ని కైవశం చేసుకున్న నవనీష్‌ను అభినందించారు. వీరితో రిసోర్సుపర్సన్లు ఎం.శ్రీనివాసరావు, హెచ్.రాజ్‌కుమార్, ఆర్.హైమావతిని ఎంఈవో అభినందించారు.

అదనపు తరగతి గదులకు రూ.37.56 లక్షల సాయం


అదనపు తరగతి గదులకు భూమి పూజ చేస్తున్న విద్యార్థిని

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం తూడెం జెడ్పీ హైస్కూల్‌లో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.37.56 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు వీటి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి నరసయ్యమ్మ, ప్రధానోపాధ్యాయుడు అప్పన్న, పంచాయతీ పెద్ద రాజారెడ్డి, దివీస్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, నరసింహారావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బైక్ యాత్రకు స్వాగతం



కొమ్మాది జంక్షన్ వద్ద మాట్లాడుతున్న లోకనాథం

మధురవాడ /తగరపువలస : పోరాటాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, స్టీల్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ జె.అయోధ్య రామ్ డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ నుంచి నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర మోటార్ సైకిల్ యాత్ర బుధవారం సాయంత్రం కొమ్మాది త్రిశక్తి ఆలయం వద్దకు చేరుకుంది. దీనికి మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29 వరకు ఉత్తరాంధ్రలో ర్యాలీ చేపట్టి అదే రోజు సాయంత్రం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభను ప్రజలంతా జయప్రదం చేయాలని కోరారు. యాత్రలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగన్, డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్, భారతి, కొండమ్మ, ఎస్.రామారావు, ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, కె.నాగరాణి, భాగం లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- జీవీఎంసీ 5వ వార్డులో రూ.2.47 కోట్లతో అభివృద్ధి పనులు


పరదేశిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెంలో వివిధ నిధుల ద్వారా పరదేశిపాలెం, మారికవలస, బొట్టవానిపాలెంలో రూ.2.42 కోట్లతో చేపట్టే 15 పనులకు బుధవారం సాయంత్రం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం, మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అనంతరం పరదేశిపాలెం గ్రామంతోపాటు వార్డులోని ఇతర ప్రాంతాల్లో పలు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్ కుమార్, భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జేఎస్ రెడ్డి, పెంద్ర అప్పన్న, బోయి సూర్రెడ్డి, బోర శ్రీను, సచివాలయ కన్వీనర్లు కల్లేపల్లి శంకరరావు, అప్పన్న, నాయకులు బోర చిన్నారెడ్డి, అప్పలరెడ్డి, అప్పారావు, చందక అప్పలరాజు, వెంపాడ అప్పలరాజు, సురేష్, జెడ్పీ కనక మహాలక్ష్మి, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం


వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడం హర్షణీయమని జిల్లా బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన ఈ బిల్లును కొత్త పార్లమెంట్ భవనంలో ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు ఈ బిల్లు ద్వారా సముచితస్థానం లభిస్తుందన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు చట్టసభలకు ఎంపికై రాజకీయాల్లోను వారి చాతుర్యాన్ని చాటనున్నారని చెప్పారు. ఈ బిల్లు ఆమోదంతో ప్రధాని మోదీకి దేశంలోని మహిళలు అందరూ నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

న్యూఢిల్లీ సైనిక శిబిరానికి గీతం విద్యార్థిని


హర్షిత ప్రగతి

కొమ్మాది: న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సైనిక శిబిరానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థిని హర్షిత ప్రగతి ఎంపికయ్యారని గీతం ఎన్‌సీసీ అధికారి కల్నల్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్న హర్షిత కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపి 9.9 సీజీపీ సాధించింది. ఆరు ఎన్‌సీసీ శిక్షణ శిబిరాలకు హాజరై ప్రతిభ చాటడంతో జాతీయ సైనిక శిబిరానికి ఎంపికైనట్లు తెలిపారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం


తేజశ్విని

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం అల్లేటి తేజశ్విని అనే డిగ్రీ విద్యార్థిని అదృశ్యమయింది. విజయనగరం జిల్లా పూసపాటిరేగకు చెందిన తేజశ్విని అమ్మవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో చిప్పాడకు చేరుకుంది. కుటుంబ సభ్యులంతా అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుండగా ఆమె అదృశ్యమైనట్లు తల్లి శ్రీదేవి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు

పద్మనాభం: మండలంలో కొత్తగా ఎంపికైన ఆరుగురు వలంటీర్లకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు బుధవారం నియామక పత్రాలు పంపిణీ చేశారు. నేరెళ్లవలసకు చెందిన ఇద్దరికి, బాందేవుపురం, రెడ్డిపల్లి, తునివలస, రేవిడి సచివాలయాలకు చెందిన ఒక్కొక్కరికి ఈ నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన అవసరం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు స్వచ్ఛతపై బుధవారం అవగాహన కలిగించారు. చెత్త డబ్బాలు, టాయిలెట్లు, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచడానికి కమిటీలు ఏర్పాటు చేశారు. వీటిలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

తగరపువలస: స్థానిక రాములమ్మ థియేటర్ ఎదురుగా గల కరూర్ వైశ్యా బ్యాంకు బ్రాంచి ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు నిర్వహించే శిబిరంలో దంత, కంటి వైద్య పరీక్షలు చేస్తారని బ్యాంకు సిబ్బంది తెలిపారు. వివరాలకు 90595 13290లో సంప్రదించాలని కోరారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

సబ్బవరం: రైతులు తమ పంటలను విధిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.రామారావు సూచించారు. మండలంలో పంటల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించడానికి వచ్చిన ఆయన.. నారపాడు, ఆసకపల్లి, సబ్బవరం గ్రామాల్లో బుధవారం పర్యటించారు. పంటలను క్షేత్ర పరిశీలన చేశారు. వరి పంటను విధిగా రైతులంతా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పంట నమోదు చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లినా, ధాన్యం కొనుగోలుకు, పంట రుణాల కోసం ఈ పంట నమోదు తప్పనిసరని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్, అలేఖ్య, జానకి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

- ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి


సమావేశంలో ఆర్‌డీవో భాస్కరరెడ్డి, నాయకులు

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొన్నిచోట్ల దూర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఉండడం వల్ల అక్కడకు ఓటర్లు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాలు బాగా దెబ్బతినడం వల్ల సమస్యగా ఉందని, అటువంటి వాటిని గుర్తించామన్నారు. దూర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను తీసి అందులోని ఓటర్లకు దగ్గరగా ఉండే విధంగా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, దెబ్బతిన్న ప్రాంతాల్లో కొత్త వాటిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఓటర్ల జాబితాలు కూడా చాలా ఖచ్చితంగా, పక్కాగా రూపొందిస్తున్నామని, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. సమావేశంలో నాయకులు కోరాడ అప్పలస్వామినాయుడు, కోరాడ రాజబాబు, గంటా నూకరాజు, కంటుభుక్త రామానాయుడు, రజనీకాంత్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు పాల్గొన్నారు.

సకాలంలో పనుల పూర్తికి చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులకు సంబంధించిన పనులు, సమస్యల పరిష్కారం సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. ఇక్కడి క్యాంపు కార్యాలయంలో మూడు మండలాల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చేపట్టి, సమస్యలు పరిష్కరించేందుకు ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించామని పేర్కొన్నారు. ఆ నిధులతో అవసరమైన పనులు చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కారం చూపుతానని తెలిపారు.

విజయ గణపతికి లడ్డూ అర్చన


లడ్డూలతో మధురవాడ గణేష్‌నగర్‌లోని విజయ గణపతి

మధురవాడ: స్థానిక గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో స్వామికి 1108 లడ్డూలు నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామికి సహస్ర లడ్డూ అర్చన, గణపతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు పద్మనాభ శర్మ, నవీన్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు.

ఎకో వినాయక పందిళ్లకు లడ్డూలు

జీవీఎంసీ 6, 7 వార్డుల్లోని పరదేశిపాలెం ఈడబ్ల్యూఎస్ కాలనీ, వాంబేకాలనీల్లో గల బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాలు ఎకో వినాయక పందిళ్ల పోటీల్లో విజేతలుగా నిలిచాయి. బుధవారం సాయంత్రం ఆయా మండపాల వద్దకు రెడ్ ఎఫ్ఎమ్, సీఎంఆర్ ప్రతినిధులు చేరుకుని 25 కేజీల లడ్డూలు అందజేశారు.

భక్తులకు పాలు పంపిణీ


మద్ది జంక్షన్‌లో అఖండ నామ సంకీర్తన భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: విజయనగరం నుంచి సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి కొండకు కాలి నడకన బయలుదేరిన అఖండ నామ సంకీర్తన భక్తులు 800 మందికి మద్ది జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ సమకూర్చిన పాలు, మజ్జిగ బుధవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు పంపిణీ చేశారు. విజయనగరం రింగ్ రోడ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జీవన సంఘం ఆధ్వర్యంలో సుమారు 108 రోజులుగా 800 మంది అఖండ నామ సంకీర్తన పూర్తి చేశారు. వీరంతా పాదయాత్రగా సింహగిరికి వెళ్తుండగా పాలు, అల్పాహారం పంపిణీ చేశారు.

2 నెలలుగా తాగునీటికి కటకట


కాలనీలో నిరుపయోగంగా మారిన చేతిబోరు


మజ్జివలస ఎస్సీ కాలనీలో పాడైన బోరు

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస ఎస్సీ కాలనీవాసులకు రెండు నెలలుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 80 కుటుంబాలకు చెందిన 300 మంది నివసిస్తున్నారు. వీరి తాగునీటి అవసరాలకు కాలనీలో నాలుగు బోరుబావులు, వీధి కుళాయిలు ఉన్నాయి. ప్రస్తుతం ఇంటింటికీ కుళాయి పథకంలో భాగంగా కాలనీలో పైప్‌లైన్ తవ్వేయడంతో ఒక్కో కుటుంబానికి బిందెడు తాగునీరు అందడం లేదు. కాలనీలో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం కోసం 8 నెలల క్రితం ఒక బోరు బావిలో మోటారు దించి నీటిని అక్కడకు తరలిస్తున్నారు. ఇంకా రామాలయం వీధిలో రెండు బోర్లు రెండు మాసాలుగా పనిచేయడం లేదు. ఇక మిగిలిన ఏకైక బోరు కూడా అంతంత మాత్రంగానే నీరు ఇస్తుండడంతో ఊరు చివర చెరువు వద్ద పాడైన బావి నుంచి నీరును తెచ్చుకుంటున్నారు. బోరు బావులు పాడైన విషయంపై పంచాయతీ, సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా రెండు నెలలుగా పట్టించుకోవడం లేదని ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు. వెంటనే బోరుబావులకు మరమ్మతులు చేయించకపోతే తాగునీటి సమస్యపై భీమిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.